AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

ఇందల్వాయి రాణా వద్ద ఆందోళన

2

2

డివైడర్‌ను ఢీకొట్టిన కారు

కామారెడ్డి వాసికి ఐవీఎఫ్ జాతీయ పురస్కారం

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి వాసికి జాతీయ పురస్కారం లభించింది. జిల్లా కేంద్రానికి చెందిన ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర ఛైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం దేశంలోనే అత్యధిక యూనిట్ రక్తాన్ని సేకరించడంతో పాటు వ్యక్తిగతంగా 77 సార్లు రక్తదానం చేశారు. దీంతో ఐవీఎఫ్ జాతీయ పురస్కారాన్ని ఈ నెల 19న లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మెఘవాల్ చేతుల మీదుగా న్యూఢిల్లీలో అందుకోనున్నారు. ఐవీఎఫ్ జాతీయ అధ్యక్షుడు అశోక్ అగర్వాల్, సెంట్రల్ అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తాలకు బాలు కృతజ్ఞతలు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో వాన దంచికొట్టింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు తెలిపినివ్వకుండా వర్షం పడుతూనే ఉంది. రాత్రి పూట భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. ప్రాజెక్ట్‌లు జలకళను సంతరించుకున్నాయి. భారీ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా శనివారం 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా కోటగిరి 6.3 సెంటీమీటర్లు, వల్మి 5.3, మోపాల్ 4.5 సెం.మీ, రుద్రూర్‌లో 4.3 సెం.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా సాలూర 0.4, బోధన్ 0.5 సెం.మీ, మోర్తాడ్, మెండోరా 0.6 సెం.మీ వర్షం పడింది. జిల్లాలోని 15 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, 16 మండలాల్లో లోటు వర్షపాతం నమోదయింది. కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో 11 సెం.మీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

- అక్షరటుడే, ఇందూరు

దంచికొట్టిన వాన

▸ ఉమ్మడి జిల్లాలో తెలిపినివ్వని వర్షం ▸ ఉప్పొంగి పారుతున్న వాగులు ▸ అలుగు దూకుతున్న చెరువులు ▸ ప్రాజెక్ట్‌లకు జలకళ

కల్యాణి ప్రాజెక్ట్ రెండు గేట్లు ఎత్తివేత

ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి ప్రాజెక్టులోకి 600 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని నీటి పారుదల శాఖ ఈఈ సోల్‌మన్ తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 మీటర్లు కాగా ప్రస్తుతం 408.50 మీటర్ల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేసి 350 క్యూసెక్కుల నీటిని దిగువకు మంజీరలోకి వదులుతున్నారు. 250 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

భారీ వర్షంతో చెరువులకు జలకళ వచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,075 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో పెద్ద చెరువులు సుమారు 700 వరకు ఉన్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సగానికి పైగా చెరువులు, కుంటలు నిండి అలుగు పారుతున్నాయి. కామారెడ్డిలోని పెద్ద చెరువు సైతం మత్తడి దూకుతుంది.

నిలిచిన రాకపోకలు

ఉమ్మడి జిల్లాలోని పలు వాగులు ఉధృతంగా పారుతున్నాయి. రాహదారులపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిరికొండ మండలంలోని గడ్కోల వాగుకు భారీ వరద వస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. తాడ్వాయి మండలం సంతాయిపేట భీమేశ్వర ఆలయం ఉప్పొంగి పారుతోంది.

ఇందల్వాయి మండలం సిర్నాపల్లి రైల్వే స్టేషన్ వద్ద, నిరికొండ మండలం తాంపల్లిలో వంతెనలపై నుంచి వాగులు పారుతున్నాయి. దీంతో ఆయా పోలీసులు ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిపివేశారు. పోతంగల్ మండలం కొట్లూర్ వద్ద తాత్కాలిక రోడ్డుపై నుంచి వరద ప్రవహిస్తోంది.

అధికారుల అప్రమత్తం

ఎడతెరిపి లేని వర్షం కారణంగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులకు సెలవులు రద్దు చేశారు. కలెక్టరేట్‌లలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వర్షాల నేపథ్యంలో ఎటువంటి సమస్యలు ఎదురైనా సమాచారం అందించాలని నిజామాబాద్ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు.

జాగ్రత్తలు అవసరం

ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. ఏదైనా విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైతే అధికారులకు సమాచారం అందించాలని, స్వయంగా మరమ్మతులు చేపట్టొద్దన్నారు. అలాగే పాత భవనాల్లో ఉండే వారు భారీ చేయాలని అధికారులు పేర్కొన్నారు. గాంధారి మండలం జువ్వాడి గ్రామానికి చెందిన చాకలి సంగవ్వ ఇల్లు శనివారం ఉదయం కూలిపోయింది. - మిగతా ఫోటోలు 2వ పేజీలో..

శ్రీరామ్‌సాగర్ లోకి ఇన్‌ఫ్లో..

వర్షాల నేపథ్యంలో శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్‌కు భారీగా వరద వస్తోంది. జలాశయంలోకి 1,04,879 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. కాలువలు, ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని వదులుతున్నారు. దీంతో 4,952 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదు అవుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 53.6 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రాజెక్ట్ దిగువన గల ప్రజలు నదిలోకి వెళ్లొద్దని కోరారు.

పొంగిపొర్లుతున్న పోచారం

కామారెడ్డి జిల్లాలోని పోచారం ప్రాజెక్ట్‌కు సైతం భారీగా ఇన్ ఫ్లో వస్తోంది. ఇప్పటికే డ్యామ్ నిండటంతో కట్టపై నుంచి నీరు పొంగి పొర్లుతోంది. పెద్దవాగు, గుండారం వాగు, పాములవాగు ద్వారా డ్యామ్‌లోకి 8 వేలకు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అంతేమొత్తంలో నీరు అలుగుపై నుంచి దిగువకు వెళ్తోంది.

నిజాంసాగర్‌లోకి..

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు సైతం భారీగా వరద వస్తోంది. సింగూరు గేట్లు ఎత్తడం, పోచారం ప్రాజెక్ట్ అలుగు పారుతుండటంతో ఆ నీరు నిజాంసాగర్‌లోకి చేరుతోంది. సింగూరు ఐదు గేట్లు ఎత్తి, జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 31,412 క్యూసెక్కులు దిగువకు వదుతున్నారు. ప్రస్తుతం నిజాంసాగర్‌లోకి 31,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.8 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.02 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



కొత్త బస్సు సర్వీస్‌లను ప్రారంభించిన పోచారం

అక్షరటుడే, బాన్సువాడ: మహాలక్ష్మి పథకంతో పెరిగిన రద్దీని తగ్గించేందుకు కొత్త బస్సులు అందుబాటులోకి తెచ్చినట్లు ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ డిపోలో శనివారం రెండు కొత్త సర్వీసు బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. డిపోకు కేటాయించిన రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు నిజామాబాద్ నుంచి జహీరాబాద్ వయా బోధన్, బాన్సువాడ, నిజాంసాగర్, బాన్సువాడ నుంచి నారాయణఖేడ్ వయా పిట్లం, నిజాంపేట్ మీదుగా నడుస్తాయన్నారు. మహాలక్ష్మి పథకం అమల్లోకి తెచ్చి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మహిళలు, విద్యార్థినుల ప్రయాణాలు బాగా పెరిగాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, బాన్సువాడ డిపో మేనేజర్ సరిత దేవి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

అక్షరటుడే, ఇందూరు : ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని సమీక్షించారు. జిల్లా కేంద్రంతో పాటు బోధన్, వర్ని మండలం జలాలపూర్ ప్రాంతాల్లో పర్యటించారు. జలాల్‌పూర్ వద్ద లోలెవెల్ వంతెన పై నుంచి ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జలాల్ పూర్ - బడాపహాడ్ మార్గంలో రాకపోకలను నిలిపి వేయాంచాలని అధికారులకు సూచించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దారి మళ్లించాలని తెలిపారు. చెరువులు, కాల్వలు, కుంటలు, వాగుల్లోకి ఎవరు కూడా చేపల వేటకు, ఈత కోసం వెళ్లకుండా కట్టడి చేయాలని ఆదేశించారు. మరో రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసినందున అధికారులు పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. జిల్లా కేంద్రంలోని బోధన్ రోడ్డు స్లూమ్ వాటర్ డ్రెయినేజీలను పరిశీలించారు. అలాగే బోధన్ పట్టణంలోని షర్బతీ కెనాల్, సరస్వతి నగర్ ప్రాంతాల్లో పర్యటించి స్థానికంగా నెలకొన్న పరిస్థితులను పరిశీలించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, నిజామాబాద్ మున్సిపల్ ఈఈ మురళీమోహన్ రెడ్డి తదితరులున్నారు. జిల్లా కలెక్టరేట్ లో కొనసాగుతున్న కంట్రోల్ రూంను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ఏవైనా ఇబ్బందులు ఏర్పడినట్లు సమాచారం అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలని సూచించారు. వర్షాల వల్ల ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూం ఫోన్ నెంబర్ 08462 220183కు సమాచారం అందించాలని సూచించారు.

విగ్రహాల ప్రతిష్ఠా పనకు నిబంధనలు తప్పకుండా పాటించాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: విగ్రహాల ప్రతిష్ఠాపనకు నిబంధనలు పాటించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్ఠించొద్దన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్ ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేయవద్దన్నారు. విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు. ఎక్కువ శబ్దంతో డీజేలను ఏర్పాటు చేయరాదన్నారు. ఇలా చేయడంవల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. రెసిడెన్షియల్ స్థలాలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలని రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేల సౌండ్ స్పీకర్లు పూర్తిగా నిషేధమన్నారు. ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డీజేలు, సౌండ్ స్పీకర్లు నిషేధమని పేర్కొన్నారు. ఎవరైనా సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. మాల్స్, సినిమా థియేటర్స్, హోటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటీ నిబంధనలు తప్పనిసరి పాటించాలన్నారు. డ్రోన్ వాడకం వల్ల ఎక్కువ ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ చర్యలు తీసుకోవడం జరగుతుందని సీపీ పేర్కొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- మిగతా లో

దేశం గర్వించదగ్గ నాయకుడు వాజ్‌పేయ్

నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, నాయకులు

అక్షరటుడే, ఇందూరు : స్వాతంత్ర్య ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర వహించిన వ్యక్తి భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయ్ దేశం గర్వించదగ్గ నాయకుడని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. వాజ్‌పేయ్ వర్ధంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయం లో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం దేశాభివృద్ధి లక్ష్యంగా జన సంఘ్ పార్టీ ఏర్పాటు చేసి పనిచేశారన్నారు. ఆయన నాయకత్వంలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు బాటలు వేశారన్నారు. రాజకీయ భీష్మ పితామహుడిగా కొనియాడారు. యువత వాజ్‌పేయ్‌ని ఆదర్శంగా తీసుకొని నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్, మాస్టర్ శంకర్, ప్రభాకర్, కోమురు నాగరాజు, వీరేందర్, హరీష్ రెడ్డి, పంచ రెడ్డి శ్రీధర్, పవన్, చిరంజీవి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా నిలుస్తా..

అక్షరటుడే, కామారెడ్డి: అన్యాయానికి గురవుతున్న పేద ప్రజలకు అండగా నిలుస్తానని.. అందుకే యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ సంస్థలో చేరానని భిక్కనూరుకు చెందిన పెద్ద బచ్చగార్ జ్ఞాన ప్రకాష్ రెడ్డి తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని అర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. భిక్కనూరు గ్రామానికి చెందిన తాను అమెరికాలో స్థిరపడి ఇక్కడికి సమాజ సేవ కోసం వచ్చినట్లు తెలిపారు. గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నానని వివరించారు. ఇంకా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అనుకుంటున్నానని తెలిపారు. జిల్లాలో అనేక మంది న్యాయపరమైన సమస్యల్లో చిక్కుకుంటున్నారని, ఎలా బయటపడాలో తెలియక ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాంటి వారికి అండగా నిలిచేందుకు యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ సంస్థలో చేరినట్లు చెప్పారు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి కల్పించిన రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన శక్తి మేరకు అన్యాయం జరుగుతున్న ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్, నాయకులు రవి, సుధాకర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అక్షరటుడే, కామారెడ్డి: ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్ హెచ్ డాక్టర్ నరేంద్ర కుమార్ వైద్యులకు సూచించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌తో కలిసి శనివారం కామారెడ్డి జీజీహెచ్, దేవి ఆస్పత్రి, దోమకొండ సీహెచ్‌సీ, భిక్కనూరు పీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లో సీజనల్ వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు వార్డులను పరిశీలించారు. రోగుల వివరాలపై ఆరా తీశారు. ప్రజలకు మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చిన ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని దేవి ఆస్పత్రిని పరిశీలించారు. ఆ తర్వాత దోమకొండ సీహెచ్‌సీ, భిక్కనూరు పీహెచ్‌సీలను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంఅండ్ హెచ్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై వివరాలను తెలుసుకునేందుకు టీవీవీపీ, డీహెచ్, డీఎంఅండ్ హెచ్, పబ్లిక్ హెల్త్ శాఖల ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో జిల్లా ఆస్పత్రి, ఒక ప్రైవేట్ ఆస్పత్రి, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ విజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. అందులో భాగంగానే కామారెడ్డికి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

భింగల్ మండలంలో..

ఆర్య నగర్‌లోని గీతాంజలి పాఠశాలలో..

కామారెడ్డిలో..

కృష్ణాష్టమిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా కృష్ణ ఆలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. నగరంలోని శివాజీ నగర్ గీతా భవన్, కంఠేశ్వర్ మురళీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంఠేశ్వర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో కృష్ణుడి బారసాలను వైభవోపేతంగా చేశారు. భక్తుల కోలాహలంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. అలాగే గ్రామాల్లో.. పలు కాలనీల్లో యువకులు ఉట్టి కొట్టి సంబరాలు జరిపారు. - అక్షరటుడే, ఇందూరు

ఎల్లారెడ్డి మండల కేంద్రంలో..

నిజామాబాద్ నగరంలో..

లింగంపల్లి కృష్ణ మందిరంలో..

భింగల్‌లో చిన్ని కృష్ణుడు

నిజామాబాద్ నగరంలో..

ఆర్మూర్‌లో..

నిజామాబాద్‌లో..

ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేటలో..

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

అక్షరటుడే, నిజాంసాగర్: ప్రజలు పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి అన్నారు. శనివారం బిచ్కుంద పోలీస్ స్టేషన్ లో బిచ్కుంద పట్టణ, మండలంలోని వినాయక మండపాల నిర్వాహకులు, డీజే ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని కోరారు. మండపాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఇందల్వాయి పోలీస్ స్టేషన్ వద్ద గిరిజనుల ఆందోళన

అక్షరటుడే, ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ వద్ద గిరిజనుల ఆందోళన దిగారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గిరిజన నాయకులను శనివారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. పలువురు నాయకులను అదుపులోకి తీసుకుని ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని అన్ని తండాల గిరిజనులు పోలీస్ స్టేషన్‌కు తరలి వచ్చారు. స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. తమ నాయకులను వదిలి పెట్టేంతవరకు స్టేషన్ వద్దే ఉంటామని భీష్మించుకుని కూర్చున్నారు. నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట రెడ్డి ఇందల్వాయి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గిరిజనులతో మాట్లాడి వారిని సముదాయించారు.

మిస్టర్ కామారెడ్డి బాడీ బిల్డర్స్ కాంపిటీషన్..

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి పట్టణంలో మిస్టర్ కామారెడ్డి బాడీ బిల్డర్స్ కాంపిటీషన్‌ను నవంబర్ 16న నిర్వహించనున్నట్లు మదీన్ మానియా, పవర్ హౌస్ జిమ్ ప్రతినిధులు నవీన్, యాసిన్ తెలిపారు. జిమ్ యజమానులంతా కలిసి చాలా సంవత్సరాల తర్వాత కామారెడ్డిలో జిల్లాస్థాయి బాడీ బిల్డర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవాళ్లు 9848278436 నంబరును సంప్రదించాలని సూచించారు.

పాంధీ పాట్లుతున్న పోచారం ప్రాజెక్ట్

దంచికొట్టిన వాన

ఉధృతంగా పారుతున్న గడ్డోల్ వాగు

అలుగు పారుతున్న కామారెడ్డి పెద్ద చెరువు



బాన్సువాడలో..

నిర్మాపల్లిలో..

గాంధారి మండలం జువ్వాడిలో..

పేకాట స్థావరంపై దాడి..

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. పలుమార్లు పోలీసులు పేకాడుతున్న వారిని పట్టుకుంటున్నా.. జూదం ఆగడం లేదు. తాజాగా ఎల్లారెడ్డి మండలంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్టపేట శివారులో జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 14 మంది వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు గుర్తించారు. పోలీసులను గమనించి పలుగురు పరారయ్యారు. మిగిలిన 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 10 మొబైల్ ఫోన్లు, 11 మోటార్ సైకిళ్లు, రూ.43,150 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ తెలిపారు. మండలంలో ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వర్షంలో జారిపడి వ్యక్తి మృతి

అక్షరటుడే, ఇందల్వాయి: మండలంలోని నిర్మాపల్లి గ్రామానికి చెందిన పురేందర్ గౌడ్ (52) అనే వ్యక్తి గన్నారం గ్రామ పరిధిలోని సిద్దుల గుట్ట సమీపంలో రోడ్డు పక్కన జారిపడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన పురేందర్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన పడి కనిపించాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

కుక్కను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్న కారు

అక్షరటుడే, కామారెడ్డి: కుక్కను తప్పించబోయి డివైడర్‌ను కారు ఢీకొన్న ఘటన భిక్కనూరు మండలం బీటీఎస్ చౌరస్తా వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా కమ్మర్ పల్లికి చెందిన రాజశేఖర్ బతుకు దెరువు నిమిత్తం ఖతర్ వెళ్లాడు. తిరిగి స్వదేశానికి వస్తున్న రాజశేఖర్ ను తీసుకురావడానికి అతని బంధువులు శుక్రవారం రాత్రి కారులో ఎయిర్ పోర్టుకు వెళ్లారు. శనివారం తెల్లవారుజామున ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరి భిక్కనూరు మండలం బీటీఎస్ చౌరస్తా వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయిన డ్రైవర్ కారును డివైడర్ ను ఢీకొట్టాడు. వేగంగా వస్తున్న కార్లు డివైడర్ ను ఢీకొట్టడంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్ సహా అతని బంధువులు ఆర్మూర్ మండలం పిప్రి గ్రామానికి చెందిన లక్ష్మి, సాయికుమార్, ఆర్మూర్ రాంనగర్ కు చెందిన సాయికుమార్, బడా భీంగల్ కు చెందిన మహిపాల్ (కారు డ్రైవర్) లకు గాయాలయ్యాయి. వెంటనే వీరిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.